

రాయలసీమ దరువు

APTEL/26/A7874

www.rayalaseemadaruvu.com

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

నూతనంగా వెలువడుతున్న 'రాయలసీమ దరువు' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను.

చట్టాలపై అవగాహన ఉండి రాజకీయ విశ్లేషణ, సమస్యల పట్ల అవగాహన, వినూత్న శైలిలో వార్తలు రాయగలిగే వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి

94940 39030
85010 70080

ప్రచురణ : శ్రీ సత్యసాయి /అనంతపురం | ఎడిటర్ : ఎనుముల కుల్లాయప్ప | బుధవారం 11 నవంబర్ 2026 | సంపుటి : 01, సంచిక : 49 | పేజీలు : 04, వెల రూ.2

ధైర్యంగా కోలుకుంటోంది.. రాప్తాడు బాలిక ఆరోగ్యంపై లోకేశ్ ట్వీట్



రాప్తాడు దాడి బాధితురాలికి ప్లాస్టిక్ సర్జరీ విజయవంతమైందన్న లోకేశ్

గాయాలు మానుతున్నాయని, చేతి కదలికలు మొదలయ్యాయని వెల్లడి

త్వరలో పీఐసీయూ నుంచి జనరల్ వార్డుకు మార్పు

అమరావతి: రాప్తాడు జెడ్పీ హైస్కూల్‌లో మానసిక రోగి దాడిలో తీవ్రంగా గాయపడిన బాలికకు నిర్వహించిన ప్లాస్టిక్ సర్జరీ విజయవంతమైందని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. ప్రస్తుతం బెంగళూరులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని, బాధితురాలు వేగంగా కోలుకుంటోందని ఆయన తెలిపారు. వైద్యులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా గాయాలకు సంబంధించిన డీబ్రిడ్‌మెంట్, కుట్లను సరిచేసే ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారని లోకేశ్ పేర్కొన్నారు. బాలిక గాయాలు క్రమంగా నయమవుతున్నాయని, ఎడమ చేతికి మిగతా..2లో

ఓయూ వీసీ ప్రభుత్వానికి గులాంగిరి చేస్తున్నారు: కవిత



ఉస్మానియా యూనివర్సిటీలో నాన్ టీచింగ్ ఉద్యోగుల మహాధర్నా

సిబ్బంది ఆందోళనకు మద్దతు తెలిపిన కవిత

వర్సిటీకి ఇస్తానన్న రూ.1,000 కోట్ల నిధులు ఎక్కడంటూ ప్రభుత్వాన్ని నిలదీసిన వైనం

హైదరాబాద్: హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ భవనం ఎదుట నాన్‌టీచింగ్ ఉద్యోగులు చేపట్టిన మహాధర్నాకు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మంగళవారం మద్దతు తెలిపారు. కాంట్రాక్ట్ సిబ్బంది సర్వీసుల క్రమబద్ధీకరణతో పాటు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు చేపట్టిన ఈ ఆందోళనలో ఆమె స్వయంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించిన కవిత... రాష్ట్ర ప్రభుత్వంపై, విశ్వవిద్యాలయ ఉపకులపతి (వీసీ)పై తీవ్ర విమర్శలు గుప్పించారు. విశ్వవిద్యాలయ పరిపాలన తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ... మిగతా..2లో

13న బంగాళాఖాతంలో అల్పపీడనం

ఏర్పడే అవకాశం - మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరిక



- ఈ నెల 13న ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.
- ఇది వాయవ్య దిశగా పయనించి, అల్పపీడనంగా మారే అవకాశం ఉందన్నారు.

అమరావతి: ఈ నెల 13న ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని

తిరుపతిలో డిక్సన్ టెక్నాలజీస్‌కు భూ కేటాయింపు

కేబినెట్ కీలక నిర్ణయాలివే

- భారీ పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్, కొత్త పారిశ్రామిక విధానాలకు ఆమోదం కీలక పరిపాలనా నిర్ణయాల దిశగా కేబినెట్ సమావేశం జరిగింది.
- ఈ భేటీలో 30కి పైగా అంశాలపై మంత్రివర్గం చర్చించింది.





అమరావతి : రాష్ట్రంలో డేటా సెంటర్ల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వటంతో పాటు భారీ పెట్టుబడులు ఆకర్షణే ప్రధాన అజెండాగా రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. ఐటీ, ఏఐ, రోబోటిక్స్ రంగాల్లో కొత్త విధానాలకు ఆమోదం లభించింది. సెమీకండక్టర్, డిస్‌ప్లే ఫ్యాబ్ విధానంలోనూ మార్పులకు పచ్చజెండా ఊపారు. విద్యుత్, గ్రీన్ ఎనర్జీ, పట్టణాభివృద్ధి, పోలీసు వ్యవస్థలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో 34 అజెండా అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకున్నారు. ఐటీ, ఏఐ, రోబోటిక్స్, సెమీకండక్టర్ రంగాలకు సంబంధించి 3 కీలక విధాన నిర్ణయాలు తీసుకుంది. 2026-31 ఏపీజీసీ-ఎక్స్‌ఆర్ విధానానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 2026-2036 రోబోటిక్స్, ఫిజికల్ ఏఐ విధానానికీ పచ్చజెండా ఊపింది. సెమీకండక్టర్, డిస్‌ప్లే ఫ్యాబ్ పాలసీ 4.0లో సవరణలకు ఆమోదముద్ర వేసింది. అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో ఈ-ప్యాక్ డేటా సెంటర్ సొల్యూషన్స్ సంస్థకు అనుమతులు మంజూరు చేసింది. మాడ్యులర్ ఎక్విప్‌మెంట్ తయారీ యూనిట్ ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్టు విలువ రూ.570.20 కోట్లు కాగా 2,565 మందికి మిగతా..2లో

తుపాన్లతో 4.61 లక్షల హెక్టార్లలో పంట నష్టం'

వివరాలు వెంటనే నమోదు చేయాలి



అర్నబ్, మురసు తుపాన్ల వల్ల దెబ్బతిన్న పంట నష్టాల నమోదును వేగవంతం చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు.

అమరావతి: అర్నబ్, మురసు తుపాన్ల వల్ల దెబ్బతిన్న పంట నష్టాల నమోదును వేగవంతం చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. అర్హులైన ఒక్క రైతు కూడా మిగిలిపోకుండా ఎన్యుమరేషన్ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రెండు తుపాన్ల ప్రభావంతో రాష్ట్రంలో మొత్తం 4,61,194 హెక్టార్లలో వ్యవసాయ పంటలు దెబ్బతిన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. అర్నబ్ తుపానుతో భారీ నష్టం : అర్నబ్ తుపానుతో 3,27,843 హెక్టార్లలో పంట నష్టం జరిగింది. 5,23,136 మంది రైతులపై ప్రభావం పడింది. మిగతా..2లో

రాజీవ్ గాంధీ దారుణ హత్య ఫోటోను

ఇప్పటి వరకు చూడలేదు

- తన భర్త రాజీవ్ గాంధీ హత్య తర్వాత ఆయన మృతదేహం చిత్రాన్ని ఇప్పటివరకు చూడలేదని సోనియా గాంధీ వెల్లడించారు.
- తన ఆత్మకథ బిలాంగింగ్‌లో ఈ విషయాన్ని తెలిపారు.



ఢిల్లీ: కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు, అగ్ర నాయకురాలు సోనియా గాంధీ తన ఆత్మకథ 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్'లో ఎన్నో ముఖ్యమైన సంఘటనలకు సంబంధించి వివరాలను పంచుకున్నారు. భారత మాజీ ప్రధాని, తన భర్త రాజీవ్ గాంధీ హత్యకు గురై 3 దశాబ్దాలు దాటినా ఇప్పటివరకు ఆ మృతదేహం ఫొటోను చూడలేదని సోనియా గాంధీ తెలిపారు. తన పిల్లలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా ఆ ఫొటో తన కంట పడకుండా చాలా జాగ్రత్తపడ్డారని పుస్తకంలో వెల్లడించారు. ఇప్పటికీ అవే జాగ్రత్తలు తీసుకుంటున్నారని తెలిపారు. ఇరువురూ తనను కాపాడాల్సిన బాధ్యతను తీసుకున్నారని ఆ పుస్తకంలో వెల్లడించారు. 1991 మే 21న తమిళనాడు శ్రీపెరంబుదూరులో ఎన్నికల ప్రచార సభకు హాజరైన రాజీవ్ గాంధీ దారుణ హత్యకు గురయ్యారు. ఎల్‌టీటీఈకి చెందిన ఒక మహిళా ఆత్మాహుతి దళ సభ్యురాలు పూలమాల వేసే నెపంతో ఆయన దగ్గరికి వెళ్లింది. తన శరీరానికి పేలుడు పదార్థాలు అమర్చుకొని మిగతా..2లో

ఢాకాలోని స్లమ్ ఏరియాలను

దిల్లీలో ఉన్నట్లు చూపిస్తారా?'



- బంగ్లాదేశ్‌లోని పేద ప్రాంతాలను చైనా వ్లాగర్లు చిత్రీకరించి, ఆ ఫుటేజీని దిల్లీలోని దృశ్యాలుగా ప్రచారం చేస్తున్నారన్న వార్తలపై భారత్ ఆందోళన వ్యక్తం చేసింది.

బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలోని మురికివాడలు, పేదలున్న ప్రాంతాలను వీడియోలు తీస్తూ వాటిని సోషల్ మీడియాలో దిల్లీగా చూపిస్తున్న చైనా వ్లాగర్ల పట్ల, అలాంటి ఘటనల పట్ల భారత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏ దేశ చిత్రాన్నైనా ఇలా వక్రీకరించి చూపించే ప్రయత్నాలు చేయడం మిగతా..2లో

వాయు కాలుష్యంలో ఎందుకు 'విశ్వగురువులం' అవుతున్నాం

- వాయు కాలుష్యంలో దిల్లీ విశ్వగురువుగా ఎందుకు మారుతోందని మల్లిఖార్జున ఖర్గే ప్రశ్నించారు.
- కాలుష్యం కట్టడి చేయడంలో మోదీ ప్రభుత్వం మాటలకే పరిమితమైందని ఆరోపించారు.



దేశ రాజధాని దిల్లీలో రోజురోజుకూ పెరిగిపోతున్న వాయు కాలుష్యంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మంగళవారం మోదీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. వాయు కాలుష్యంలో దిల్లీ విశ్వగురువుగా ఎందుకు మారుతోందని ప్రశ్నించారు. కాలుష్యం కట్టడి చేయడంలో మోదీ ప్రభుత్వం మాటలకే పరిమితమైందని ఆరోపించారు. దీపావళి అనంతరం పొరుగు రాష్ట్రాల్లో పంట వ్యర్థాల దహనం వల్ల దిల్లీలో కాలుష్య స్థాయిలు విపరీతంగా పెరిగిపోయిన నేపథ్యంలో ఖర్గే ఈ మేరకు వ్యాఖ్యానించారు.

"2019 మే 8న ప్రధాని మోదీ వాయు కాలుష్యాన్ని 'ప్రధాన సవాలు'గా గుర్తించారు. కానీ ఆయన ప్రభుత్వం ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అరకొర చర్యలు, ఇతరులపై నిందలు వేయడమే బీజేపీ మార్క్‌గా మారిపోయింది. దిల్లీ-ఎన్‌సీఆర్ నుంచి ఉత్తర్ ప్రదేశ్, బిహార్, హరియాణా, పంజాబ్, రాజస్థాన్ వరకు ప్రజలు స్వచ్ఛమైన గాలి కోసం అల్లాడుతున్నారు. వాస్తవాలు ఎంత ఆందోళనకరంగా ఉన్నాయో, అంతే సిగ్గుచేటుగా కూడా ఉన్నాయి. నివేదికల ప్రకారం, 2023లో దిల్లీలో సంభవించిన 17,188 మరణాలకు వాయు కాలుష్యమే కారణం. ఇది మొత్తం మరణాల్లో దాదాపు 15 శాతం. అలాగే, 2021లో భారతదేశం అంతటా, ఐదేళ్లలోపు వయసున్న 1,69,400 మంది పిల్లలు వాయు కాలుష్య సంబంధిత కారణాలతో మరణించారు. ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాల్లో PM2.5 ప్రభావానికి గురికావడం వల్ల ఊపిరితిత్తులు మిగతా..2లో

416 గ్రామాల్లో భూ రీసర్వే పూర్తి..

భూదార్ నంబర్ల కేటాయింపుపై పొంగులేటి కీలక ఆదేశాలు



- భూ రీసర్వే వల్ల చిన్న పొరపాటు కూడా భవిష్యత్తులో భూ వివాదానికి కారణం కాకూడదని అధికారులకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.
- మంగళవారం తెలంగాణ సచివాలయంలో భూ రీసర్వే పురోగతిపై జిల్లా కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.
- 416 గ్రామాల్లో భూ రీసర్వే పూర్తి.. భూదార్ నంబర్ల కేటాయింపుపై పొంగులేటి కీలక ఆదేశాలు

హైదరాబాద్, నవంబర్10: భూ రీసర్వే వల్ల చిన్న పొరపాటు కూడా భవిష్యత్తులో భూ వివాదానికి కారణం కాకూడదని అధికారులకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి

ఏ హోదాకు వెళ్లినా మీ గతాన్ని మర్చిపోవద్దు

నూతన డీఎస్పీలతో సీఎం రేవంత్ రెడ్డి

- శిక్షణ పూర్తి చేసుకున్న డీఎస్పీల ముఖాముఖి కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు.
- ఏ హోదాకు వెళ్లినా గతాన్ని మర్చిపోవద్దని సూచించారు.



గతంలో గ్రూప్-1 నియామకాల ప్రక్రియ చాలా ఆలస్యంగా జరిగేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆనాటి ప్రభుత్వ నిర్ణయాలు, నిర్లక్ష్యం చాలా మందికి తీరని నష్టాన్ని మిగిల్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాను బాధ్యతలు చేపట్టాక పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి, నియామక ప్రక్రియ చేపట్టినట్లు గుర్తు చేశారు. గతంలో రాజకీయ పునరావాస కేంద్రంగా పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఉండేదని విమర్శించారు. అవగాహన లేనివారిని బోర్డులో నియమించి గత ప్రభుత్వం తప్పు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ హోదాకు వెళ్లినా మీ గతాన్ని మరిచిపోవద్దని నూతన డీఎస్పీలను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. శిక్షణ పూర్తి చేసుకున్న డీఎస్పీలతో ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. డీజీపీ సీవీ ఆనంద్, హోంశాఖ ముఖ్యకార్యదర్శి శిఖా గోయల్, భద్రత సలహాదారు శివధర్ రెడ్డి సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మనం వచ్చిన నేపథ్యం మరిచిపోతే మన హోదాకు న్యాయం చేయలేమని సీఎం అన్నారు. రాష్ట్ర భవిష్యత్తును రాబోయే 30 ఏళ్ల ఎలా నడిపించాలో నూతన డీఎస్పీల చేతుల్లోనే ఉందన్నారు. అధికారుల నిర్ణయాలే ప్రభుత్వ పనితీరుకు గీటురాయిగా మారతాయని వ్యాఖ్యానించారు. పది మంది డీఎస్పీలు అరాచకంగా వ్యవహరించినా రాష్ట్రంలో సరైన పరిపాలన లేదనే ఆరోపణలు వస్తాయన్నారు. శాంతిభద్రతలు క్షీణించి మిగతా..2లో

కరవుతో ఇబ్బందుల్లో రైతులు..

పంట రుణాల రీషెడ్యూల్‌కు భట్టి ఆదేశాలు



- రైతులకు బ్యాంకులు అండగా నిలవాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు.
- ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో కరవు పరిస్థితులు నెలకొన్నాయని..
- రైతులకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

హైదరాబాద్, నవంబర్ 10: రైతులకు బ్యాంకులు అండగా నిలవాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. (మంగళవారం) ప్రజా భవన్‌లో జరిగిన ప్రత్యేక రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశానికి డిప్యూటీ సీఎం హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో కరవు పరిస్థితులు నెలకొన్నాయని.. రైతులకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కరవు పరిస్థితులను ఎదుర్కొనేందుకు బ్యాంకులు ప్రత్యేక చొరవ చూపాలని... అర్హులైన రైతుల పంట రుణాలను రీషెడ్యూల్ చేయాలని ఆదేశించారు.

మిగతా..2లో

మొదటి పేజి తరువాయి

తుపాన్లతో 4.61 లక్షల హెక్టార్లలో పంట నష్టం' వివరాలు వెంటనే నమోదు చేయాలి

ఈ తుపాను వల్ల వ్యవసాయ పంటలకు ఏకంగా రూ.2,392.84 కోట్ల నష్టం వాటిల్లినట్లు అధికారులు వెల్లడించారు. మురసు తుపానుతో 1,33,351 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. 1,86,269 మంది రైతులపై ప్రభావం పడింది. 29,960 హెక్టార్లలో నష్టం : రెండు తుపాన్లతో కలిపి 29,960 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. అర్నబ్ తుపాను ఉద్యాన పంటల నష్టాల ఎన్యుమరేషన్ 99.24 శాతం పూర్తయింది. కానీ, మురసు తుపాను నష్టాల నమోదు మాత్రం 32.77 శాతమే పూర్తయిందని అధికారులు తెలిపారు. దీనిపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. మురసు నష్టాల నమోదును వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది కొరత ఉంటే వెంటనే భర్తీ చేసి, నష్టపోయిన ప్రతి రైతును గుర్తించాలని సూచించారు. నష్టాల నమోదు పూర్తయిన వెంటనే పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు.

13న బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరిక

వాతావరణ శాఖ వెల్లడించింది. ఇది వాయవ్య దిశగా పయనించి, తర్వాత 24 గంటల్లో బలమైన అల్పపీడనంగా మారే అవకాశం ఉందన్నారు. దీని ప్రభావంతో ఈ నెల 14, 15 తేదీల్లో అండమాన్ సముద్రం, ఆగ్నేయ బంగాళాఖాతంలో అలల ఉద్ధృతి పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ సమయంలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్లు, గరిష్టంగా 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. 14, 15 తేదీలలో మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లవద్దని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిక జారీ చేశారు. ఇప్పటికే రెండు వరుస తుపాన్లను చవిచూసిన రాష్ట్ర ప్రజలు, తాజా అల్పపీడనంతో ఇబ్బందులు పడే అవకాశం ఉంది. తాజాగా ఏర్పడిన అల్పపీడనం రాష్ట్రంపై చూపించే ప్రభావం, గమనంపై ఇప్పుడే ఓ నిర్ణయానికి వచ్చే పరిస్థితి లేదు. అల్పపీడనం గమనాన్ని వాతావరణ శాఖ అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారు.

ధైర్యంగా కోలుకుంటోంది.. రాప్తాడు బాలిక ఆరోగ్యంపై లోకేశ్ ట్వీట్

ఉన్న స్లింగ్‌ను తొలగించడంతో ఆమె నెమ్మదిగా చేతిని కదిలిస్తోందని చెప్పారు. ఆ చిన్నారి ఎంతో ధైర్యంతో చికిత్సకు సహకరిస్తోందని ఆయన వివరించారు. ప్రస్తుతం ఆమెకు నొప్పి నివారణ మందులు, ఫీడింగ్ సపోర్ట్ అందిస్తున్నారని.. త్వరలోనే పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (పీఐసీయూ) నుంచి జనరల్ వార్డుకు మార్చుతారని మంత్రి పేర్కొన్నారు.

కరవుతో ఇబ్బందుల్లో రైతులు.. పంట రుణాల రీషెడ్యూల్‌కు భట్టి ఆదేశాలు

ఆ పంటలకు రుణాలు అందించాలి

రబీ సీజన్‌కు కొత్త పంట రుణాలను సకాలంలో అందించాలని భట్టి సూచించారు. బ్యాంకుల చుట్టూ రైతులు తిరిగే పరిస్థితి ఉండకూడదని తెలిపారు. విద్య, గృహ రుణాల మంజూరులో బ్యాంకులు సానుకూలంగా ఉండాలని నిర్దేశించారు. ఎంఎస్ఎంఈ, మౌలిక సదుపాయాల రంగాలకు రుణాలు పెంచాలని ఆదేశించారు. రాష్ట్రంలోని 365 మండలాలను కరవు ప్రాంతాలుగా ప్రకటించామని.. 111 మండలాల్లో తీవ్ర కరవు పరిస్థితులు ఉన్నట్లు తెలిపారు. తక్కువ నీటితో సాగయ్యే పంటలకు రుణాలు అందించాలని.. పంటల మార్పిడి, సూక్ష్మ సేద్యానికి ఆర్థిక సహకారం అందించాలని అధికారులను ఆదేశించారు.

అదనపు ఉపాధి కల్పించేలా చర్యలు

రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు కల్పించాలని ఉపముఖ్యమంత్రి సూచించారు. 10 నుంచి 15 శాతం రైతు కుటుంబాలకు అదనపు ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. స్వయం సహాయక సంఘాలకు అదనంగా రూ.2 లక్షల వరకు రుణాలపై పరిశీలన చేయాలని అన్నారు. నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి రుణాలు ఇవ్వాలని నిర్దేశించారు. ఈ నెల 19 నాటికి రాజీవ్ యువ వికాసం అమలుకు బ్యాంకర్లు సహకరించాలన్నారు. రైతులు తదుపరి వ్యవసాయ సీజన్‌ను ఆత్మవిశ్వాసంతో ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

416 గ్రామాల్లో భూ రీసర్వే పూర్తి..

భూదార్ నంబర్ల కేటాయింపుపై పొంగులేటి కీలక ఆదేశాలు

పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం తెలంగాణ సచివాలయంలో భూ రీసర్వే పురోగతిపై జిల్లా కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి భూ యజమానికి స్పష్టమైన హక్కులు, కచ్చితమైన హద్దులే లక్ష్యమని పేర్కొన్నారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో భూదార్ నంబర్ల కేటాయింపు వేగవంతం చేయాలని ఆదేశించారు. తరతరాలుగా పరిష్కారం కాని భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు. అధికారులంతా పారదర్శకత, కచ్చితత్వంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్లను మంత్రి పొంగులేటి కోరారు. తెలంగాణలో ప్రస్తుతం సమగ్ర భూ రీసర్వే వెయ్యి గ్రామాలు దాటిందని గుర్తు చేశారు. ఇప్పటి వరకు 416 గ్రామాల్లో సర్వే ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. భూ యజమానుల ప్రయోజనాలకే సర్వేలో అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. రెవెన్యూ రికార్డుల ఆధారంగానే భూ సర్వే ప్రారంభించాలని పేర్కొన్నారు. సర్వే పూర్తయ్యాక భూ యజమానులకు తప్పనిసరిగా నోటీసులు ఇవ్వాలని తెలిపారు. అభ్యంతరాలు, సూచనల స్వీకరణకు భూ యజమానులకు అవకాశం కల్పించాలని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. అలాగే రైతులకు సర్వే విధానం, అభ్యంతరాల పరిష్కారంపై అవగాహన కల్పించాలని కోరారు. తొలి దశలో 2,720 గ్రామాల్లో ప్రభుత్వం భూ రీసర్వే చేపట్టిన సంగతి తెలిసిందే. 125 ఏళ్ల తర్వాత తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర భూ సర్వేకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిన విషయం విదితమే.

ఓయూ వీసీ ప్రభుత్వానికి గులాంగిరి చేస్తున్నారు: కవిత

ఉద్యోగులను ఓయూ వీసీ పట్టించుకోవడం లేదని, ఆయన ప్రభుత్వానికి గులాంగిరి చేస్తున్నారంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. దాదాపు ఏడాదిన్నర కాలంగా ఉద్యోగులు నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమని కవిత అన్నారు. సుమారు 35 ఏళ్లుగా ఉద్యోగులు వివిధ ప్రభుత్వాల హయాంలో దోపిడీకి గురవుతున్నారని పేర్కొన్నారు. నాన్‌టీచింగ్ సిబ్బంది పోరాటానికి పర్మినెంట్ ఉద్యోగులు కూడా మద్దతు తెలపడాన్ని ఆమె ప్రశంసించారు. విశ్వవిద్యాలయానికి ఛాన్సలర్‌గా వ్యవహరిస్తున్న రాష్ట్ర గవర్నర్ వెంటనే ఈ అంశంలో జోక్యం చేసుకోవాలని, నాన్‌టీచింగ్ సిబ్బంది న్యాయమైన సమస్యను త్వరితగతిన పరిష్కరించేలా ఆదేశాలు ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. ఉస్మానియా యూనివర్సిటీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇస్తానన్న రూ.వెయ్యి కోట్లు ఎక్కడ? అని ఆమె సూటిగా ప్రశ్నించారు. నిధులు మంజూరు చేస్తామని ప్రకటించి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేదని తప్పుబట్టారు.

విదేశాల నుంచి 73 మంది డిపోర్టేషన్

ఉగ్రవాదులకు విదేశీ ఆశ్రయాలు లభించకుండా దౌత్యపరమైన చర్యలను కేంద్రం వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ఈ ఏడాది సెప్టెంబర్‌లో ప్రత్యేక 'ఎక్స్‌ట్రాడిషన్ పోర్టల్'ను ప్రారంభించింది. దీనివల్ల గడిచిన ఏడాది కాలంలో విదేశాల నుంచి 73 మంది కీలక ఉగ్రవాదులను భారత్‌కు రప్పించగలిగారు. మరోవైపు బాంబుల తయారీకి వాడే అమ్మోనియం నైట్రేట్ అమ్మకాలపై ఇప్పుడు ఆకస్మిక తనిఖీలు నిరంతరం జరుగుతున్నాయని అధికార వర్గాలు వెల్లడించాయి. ఎర్రకోట ఉగ్రదాడి జరిగి ఏడాది పూర్తయిన వేళ దేశవ్యాప్తంగా భద్రతా దళాలు హై అలర్ట్‌లో ఉన్నాయి. భవిష్యత్తులో ఇలాంటి దాడులను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటోంది. దేశ రాజధాని దిల్లీలో ఎర్రకోట పేలుడు జరిగి ఓ ఏడాది గడిచిన నేపథ్యంలో కేంద్ర భద్రతా సంస్థలు దేశవ్యాప్తంగా నిఘాను కట్టుదిట్టం చేశాయి. భవిష్యత్తులో ఇలాంటి దాడులను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటోంది. గడిచిన ఏడాది కాలంలో సరిహద్దు అవతల నుంచి సాగుతున్న ఉగ్రవాద నెట్‌వర్క్‌లపై భద్రతా దళాలు భారీ దాడులు జరిపాయి. వీటిల్లో 300 మందికి పైగా ఉగ్రవాద ఆపరేటివ్‌లను అరెస్ట్ చేయగా, విదేశాల్లో తలదాచుకున్న 73 మంది మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదులను భారతదేశానికి రప్పించారు. ఎర్రకోట పేలుడుతో ఇలాంటి దాడులను నివారించడానికి కేంద్ర నిఘా సంస్థలు ఒక విధానాన్ని రూపొందించాయి. ఈ ఆలోచనతోనే ఫిబ్రవరి 23న 'ప్రహార్: జాతీయ ఉగ్రవాద నిరోధక విధానం, వ్యూహం'విధానాన్ని ప్రవేశపెట్టింది. ఉగ్రవాదం పట్ల జీరో టాలరెన్స్ విధానాన్ని ఉంటుందని 2026 సెప్టెంబర్ లో జరిగిన రాష్ట్ర డీజీపీలు, కేంద్ర ఏజెన్సీ అధిపతుల ఉన్నత స్థాయి సమావేశంలో స్పష్టం చేసింది. ఈ 'ప్రహార్' వ్యూహంలో భాగంగానే పాకిస్థాన్ ఐఎస్ఐ మద్దతు ఉన్న 'షహజాద్ భట్టి నెట్‌వర్క్' పై దేశవ్యాప్తంగా దాడులు చేసి 100కు పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. దాదాపు 300 మందికి పైగా కార్యకర్తలను అరెస్టు చేశారు. ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్‌లు పాకిస్థాన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ గుర్తులు ఉన్న హ్యాండ్ గ్రెనేడ్‌లు, అక్రమ ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాయి. అనంతరం సెప్టెంబర్ 26న చట్టవ్యతిరేక కార్యకలాపాల (నివారణ) చట్టం కింద ఎన్‌బీఎన్ (గ్రూదీచీ) ను ఉగ్రవాద సంస్థగా కేంద్రం ప్రకటించింది. అటు యువతలో వచ్చే ఉగ్ర ఆలోచనల ప్రవర్తన మార్పులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపాయి. "ఎర్రకోట పేలుడు కేసు ప్రత్యేకమైనది. ఎందుకంటే ఇందులో అత్యంత అర్హత కలిగిన నిపుణులు పాలుపంచుకున్నారు. ఇప్పుడు అమ్మోనియం నైట్రేట్, ఇతర పదార్థాల అమ్మకాలపై ఎప్పటికప్పుడు ఆకస్మిక తనిఖీలతో సహా అనేక నిబంధనలు అమల్లో ఉన్నాయి." అని ఓ అధికారి తెలిపారు. అదే సమయంలో కేంద్ర భద్రతా సంస్థలు అనేక ఆపరేషన్లు చేపట్టి తీవ్రవాద మాడ్యూళ్లను విజయవంతంగా నిర్మూలించాయి. జైష్-ఎ-మొహమ్మద్ (జేవీవీ), లష్కర్-ఎ-తైబా (గ్రమ) వంటి నిషేధిత సంస్థల మద్దతు వ్యవస్థలను దెబ్బతీశాయి. ఖలిస్థాన్ అనుకూల శక్తుల (గ్రఖజు)పై తీసుకున్న చర్యలు, బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్, ఖలిస్థాన్ జిందాబాద్ ఫోర్స్ వంటి సంస్థల నెట్‌వర్క్ వ్యూహాలను నిర్వీర్యం చేశాయి. దీనివల్ల సరిహద్దుల గుండా జరిగే ఆయుధాల స్మగ్లింగ్‌కు అంతరాయం కలగడంతో పాటు, కీలకమైన వ్యక్తులను అరెస్టు చేశాయి.

ఏ హోదాకు వెళ్లినా మీ గతాన్ని మర్చిపోవద్దు - నూతన డీఎస్పీలతో సీఎం రేవంత్ రెడ్డి

మొదటి పేజి తరువాయి



అవినీతి పెరిగిందనే ఆరోపణలు కూడా రావొచ్చన్నారు. పోలీసులు సరిగా విధులు నిర్వర్తిస్తే ప్రభుత్వ ప్రతిష్ఠ పెరుగుతుందన్నారు. అధికారుల నుంచి ప్రభుత్వం కోట్లు ఆశించట్లేదని, ఎన్నికల్లో రిగ్గింగ్ చేయాలని ఆదేశాలు కూడా ఇవ్వడం లేదన్నారు. బాధ్యత గుర్తించి నిజాయితీగా విధులు నిర్వర్తించాలని మాత్రమే ప్రభుత్వం కోరుకుంటుందని తెలిపారు. సర్వం ఒడ్డి శాంతిభద్రతలు కాపాడి, పోలీసుల గౌరవాన్ని సీనియర్లు పెంచారన్న సీఎం, పోలీసు శాఖ విశ్వాసమైన విభాగంగా కొనసాగించాల్సిన బాధ్యత మీపై ఉందని అన్నారు.

అవగాహన రాహిత్యంతో గతంలో తప్పులు

ప్రభుత్వ ఉద్యోగ నియామకాల ప్రక్రియలో గతంలో ఉద్దేశపూర్వకంగా, అవగాహన రాహిత్యంతో తప్పులు చేశారని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. యూపీఎస్సీ తరహాలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను తీర్చిదిద్దాలని నిర్ణయం తీసుకొని అనుభవం, చిత్తశుద్ధి గల వ్యక్తులను బోర్డులో నియమించినట్లు తెలిపారు. 563 గ్రూప్-1 పోస్టులకు నోటిఫికేషన్ ఇస్తే 562 మంది చేరినట్లు ఆయన పేర్కొన్నారు. ఇంత పెద్దస్థాయిలో గ్రూప్-1 పోస్టులు ఎప్పుడు ఇవ్వలేదని, తమ ప్రభుత్వ పారదర్శక నిర్ణయాల వల్లే మీకు అవకాశాలు వచ్చాయని చెప్పారు. 2011 నుంచి 2025 వరకు గ్రూప్ -1 నియామకాల ప్రక్రియ జరిగిందని గతంలో నోటిఫికేషన్, ప్రవేశ పరీక్షల విషయంలో గందరగోళం జరిగినట్లు గుర్తుచేశారు.

సుప్రీంకోర్టు వరకు వెళ్లి పోరాడితే ఉద్యోగాలు

కొంతమంది పనిగట్టుకొని తెలంగాణలో గ్రూప్ -1 నియామకాల పట్ల ఆరోపణలు చేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆక్షేపించారు. నియామకాల విషయంలో అవినీతి జరిగిందని ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ ఆరోపణలు రాజకీయంగా తమకేం కొత్త కాదని, తెలంగాణను వికాసం వైపు నడిపించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. గ్రూప్ -1 నియామకాల వివాదంపై సుప్రీంకోర్టు వరకు వెళ్లి పోరాడితే ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు.

తిరుపతిలో డిక్సన్ టెక్నాలజీస్‌కు భూ కేటాయింపు - కేబినెట్ కీలక నిర్ణయాలివే

మొదటి పేజి తరువాయి



ఉద్యోగాలు లభించనున్నాయి. అదానీ క్లౌడ్ హబ్ ప్రాజెక్టు పురోగతిపై సమీక్ష నివేదికను కూడా పరిశీలించింది.

కేబినెట్ సమావేశానికి వస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

ఏఐ డేటా సెంటర్‌కు ఆమోదం : తిరుపతి జిల్లా నాయుడుపేటలో కార్బన్ కాస్మో సంస్థకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ.4,000.20 కోట్లతో ఎల్ఎఫ్‌పీ ప్రీకర్సర్, క్యాథోడ్ మెటీరియల్స్ తయారీ పరిశ్రమ ఏర్పాటు చేయనుంది. దీంతో 700 మందికి ఉపాధి లభించనుంది. తిరుపతిలో డిక్సన్ సంస్థకు కూడా అనుమతులు ఇచ్చింది. 700 కోట్ల రూపాయల పెట్టుబడితో ఏర్పాటు చేసే యూనిట్ ద్వారా 2,300 మందికి ఉద్యోగాలు రానున్నాయి. భీమిలిలో అమానం సంస్థ ఏర్పాటు చేయనున్న గ్రీన్ ఇంటిగ్రేటెడ్ ఏఐ డేటా సెంటర్‌కు కేబినెట్ ఆమోదం తెలిపింది. 512 మెగావాట్ల సామర్థ్యంతో ఈ ప్రాజెక్టు ఏర్పాటు కానుంది. మొత్తం పెట్టుబడి 31,387 కోట్ల రూపాయలు. 1000 మందికి ఉద్యోగాలు కల్పించనున్నారు. భోగాపురంలో రిలయన్స్ ఏఐ డేటా సెంటర్‌కు భూముల బదలాయింపు ప్రతిపాదనకూ కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రావలి స్పిన్నర్స్ పరిశ్రమ విస్తరణకు మంత్రివర్గం అనుమతులు ఇచ్చింది. 236.92 కోట్ల రూపాయల పెట్టుబడితో చేపట్టే దీని ద్వారా 1,569 మందికి ఉపాధి లభించనుంది. టీటీడీలో కొత్త పోస్టులు : రాథీ గ్రీన్ ఎనర్జీ, న్యూల్యాండ్ ల్యాబ్స్ సంస్థలకు ప్రోత్సాహకాలు మంజూరు చేసే ప్రతిపాదనలకూ ఆమోదం తెలిపింది. విజయవాడలో 15 మెగావాట్ల వ్యర్థాల నుంచి విద్యుత్ తయారీ ప్లాంటు ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రోజుకు 1,023 టన్నుల చెత్తను ఈ ప్లాంటులో ప్రాసెస్ చేయనున్నారు. ఇందుకు జెన్‌కోకు చెందిన 5.50 ఎకరాల భూమిని విజయవాడ నగరపాలక సంస్థకు ఉచితంగా బదలాయించనున్నారు. పలు సంస్థలకు భూ కేటాయింపులకు సంబంధించి కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మంగళగిరి పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్ సేఫ్టీ డైరెక్టరేట్ ఏర్పాటు చేయనుంది. డీజీపీ పరిధిలో ఈ విభాగం పని చేస్తుంది. ఐజీ స్థాయి అధికారి డైరెక్టర్‌గా వ్యవహరించనున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో రెండు కొత్త పోస్టుల ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రధాన సన్నిధి యాదవ, అదనపు సన్నిధి యాదవ పోస్టులను మంజూరు చేసింది. దేవాదాయ శాఖ శిల్ప విభాగంలో చీఫ్ స్థపతి పోస్టు ఏర్పాటుకూ పచ్చజెండా ఊపింది.

రాజీవ్ గాంధీ దారుణ హత్య ఫోటోను ఇప్పటి వరకు చూడలేదు

మొదటి పేజి తరువాయి



మానవబాంబులా దాడి చేసింది. ఈ దుర్ఘటనలో రాజీవ్ సహా మరో 14 మంది ప్రాణాలు కోల్పోయారు. దేశ రాజకీయ చరిత్రలో ఈ ఘటన తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈ పేలుడు తర్వాత రాజీవ్ మృతదేహానికి సంబంధించిన ఫొటో అప్పటి పత్రికల్లో ప్రచురితమైంది. తర్వాత కూడా పలుమార్లు మళ్లీ మళ్లీ పత్రికలు ముద్రిస్తూనే ఉన్నాయి. అయితే ఇన్నాళ్లుగా ఆ ఫొటో తన కంట పడకుండా, తన పిల్లలు జాగ్రత్తగా చూసుకున్నారని పుస్తకంలో సోనియా గాంధీ పేర్కొన్నారు. 'నాకు ఏ దినపత్రికను లేదా మేగజైన్‌ను నేరుగా ఇవ్వకూడదని రాహుల్, ప్రియాంక- సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ప్రతి ఒక్కదానిని వారు మొదట నిశితంగా పరిశీలించిన తర్వాతే నా ముందుకు వచ్చేలా చూసుకున్నారు. ఆ సమయంలో నేను ఒక చిన్న పిల్లనైతే- రాహుల్, ప్రియాంకలు తల్లిదండ్రులై నన్ను కాపాడుకున్నారు. ముప్పై ఏళ్ల దాటినా నేను ఇప్పటికీ ఆ ఫొటోను చూడలేదు.'

- ఆత్మకథ బిలాంగింగ్‌లో సోనియా గాంధీ, సీపీపీ ప్రెసిడెంట్

'రాహుల్ నవ్వు చూసి ఆమె అలసట మాయమయ్యేది'

ఇదే పుస్తకంలో రాహుల్ గాంధీ బాల్యానికి సంబంధించిన విశేషాలను కూడా సోనియా గాంధీ పంచుకున్నారు. పుట్టినప్పుడు చాలా సన్నగా ఉండి, తర్వాత బుగ్గలు, డబుల్ చిన్‌తో బొద్దుగా మారిన రాహుల్ అంటే కుటుంబంలో అందరికీ ఎంతో ఇష్టం ఉండేదని పేర్కొన్నారు. కుటుంబం మొత్తానికి, ముఖ్యంగా తన నానమ్మ ఇందిరా గాంధీకి అమితమైన ఆనందాన్ని ఇచ్చేవాడని చెప్పారు. రోజంతా రాజకీయాలు, దేశ వ్యవహారాలతో అలసిపోయి ఇంటికి వచ్చే ఇందిరా గాంధీ- రాహుల్‌ను చూడగానే ఒక్కసారిగా చిరునవ్వులు చిందించేవారని తెలిపారు. ఇందిరా గాంధీ ఇంటికి రాగానే రాహుల్‌ను ఎత్తుకొని ఆటలాడేవారని పాత జ్ఞాపకాల్ని గుర్తుచేసుకున్నారు. రాహుల్ ఆమెను గట్టిగా పట్టుకునేవాడని, జుట్టూ లాగేవాడని, దానికి ఆమె సంతోషించే వారని బిలాంగింగ్ పుస్తకంలో చెప్పుకొచ్చారు. రాహుల్‌కు కొంచెం ఆరోగ్యం బాగోలేకపోయినా ఇందిరా గాంధీ ఎంతో ఆందోళన చెందేవారని, ఎక్కడున్నా వాకబు చేసేవారని ప్రస్తావించారు.

రాహుల్ కంటే ముందు బాబు పుట్టాడు- కానీ ఒక్కరోజులోనే!

బిలాంగింగ్ పుస్తకంలో సోనియా గాంధీ తన వ్యక్తిగత జీవితంలోనే అత్యంత విషాదకర రహస్యాన్ని ప్రపంచానికి వెల్లడించారు. రాహుల్ గాంధీ కంటే ముందే మరో బాలుడు జన్మించి, ఒక్క రోజులోనే కన్నుమూసిన విషయం గురించి వివరిస్తూ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. ఆ పుస్తకంలో కథనం ప్రకారం- 1968 సెప్టెంబరులో సోనియా గాంధీ గర్భం దాల్చిన వార్త కుటుంబంలో ఎనలేని సంతోషాన్ని నింపింది. సాధారణంగా చాలా గంభీరంగా ఉండే ఇందిరా గాంధీ కూడా ఆ వార్త వినగానే భావోద్వేగానికి లోనై సోనియాను ఆప్యాయంగా హత్తుకున్నారు. అయితే గడువు తేదీ కంటే 2 నెలల ముందుగానే సాధారణ ప్రసవం ద్వారా 1969 జనవరి 18న పుట్టిన మగబిడ్డ మరుసటి రోజే మరణించాడు. ఆ పసికందు భౌతిక కాయాన్ని రాజీవ్ గాంధీ, సంజయ్ గాంధీ కలిసి మెహ్రౌలీలోని ఫిరోజ్ గాంధీ ఫామ్‌హౌస్‌లో ఖననం చేశారని ఆ జ్ఞాపకాల్ని వెల్లడించారు.

ఢాకాలోని స్లమ్ ఏరియాలను దిల్లీలో ఉన్నట్లు చూపిస్తారా?'

మొదటి పేజి తరువాయి



చాలా దురదృష్టకరమని స్పష్టం చేసింది. ఈ మేరకు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తీవ్రంగా మండిపడ్డారు. డబ్బులు ఇచ్చి లేదా విదేశీ శక్తులను వాడుకొని ఢాకాను దిల్లీగా చిత్రీకరించే ప్రయత్నాల వల్ల ఇలాంటి పనులు చేసేవారి నమ్మకత్వమే దెబ్బతింటుందని ఆయన హెచ్చరించారు. ఈ తప్పుడు ప్రచారాలపై బంగ్లాదేశ్ సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని జైస్వాల్ డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్‌కు చెందిన 'ప్రోథోమ్ ఆలో' ప్రచురించిన ఒక పరిశోధనాత్మక నివేదిక ప్రకారం, సుమారు 150 మంది చైనా జాతీయులు ఢాకాలోని పేద ప్రాంతాలను చిత్రీకరిస్తూ వాటిని దిల్లీగా పేర్కొంటూ ప్రచారం చేస్తున్నట్లు వెల్లడైంది. చైనాకు చెందిన వ్లాగర్లు టెక్‌పారా, ఉత్తరతో సహా పలు ప్రాంతాల్లో చిత్రీకరిస్తూ, వాటిని భారత రాజధానిలోని భాగాలుగా చూపిస్తున్నారు. అక్కడి జీవన పరిస్థితులు, నివాసితులపై అవమానకరమైన వ్యాఖ్యలు చేస్తున్నట్లు పేర్కొంది. యునైటెడ్ కింగ్‌డమ్‌లో భారత మర్చంట్ నేవీ మాస్టర్ కెప్టెన్ అజయ్ పంత్ అరెస్టుపైనా రణ్ ధీర్ జైస్వాల్ స్పందించారు. "మేము కెప్టెన్ పంత్ న్యాయవాదులతో పాటు ఆయన కుటుంబంతో కూడా సంప్రదింపులు జరుపుతున్నాం. ఆయన యోగక్షేమాలను తెలుసుకోవడానికి హైకమిషన్ పలుమార్లు కెప్టెన్ పంత్‌ను పరామర్శించింది. మేము ఆయన కుటుంబ సభ్యుల, ముఖ్యంగా ఆయన భార్య పర్యటనకు కూడా ఏర్పాట్లు చేశాం. ఆయన భార్య చివరిసారిగా నవంబర్ 9న సందర్శించారు. ఈ విషయంలో మేము ఇక్కడి యూకే హైకమిషన్‌తో పాటు యూకే విదేశాంగ కార్యాలయంతో కూడా సంప్రదింపులు జరుపుతున్నాం. ఆయన భద్రత, శ్రేయస్సు కోసం మేము మా వంతు కృషి చేస్తున్నాం." అని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ అన్నారు.

అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాలపై తొలిసారిగా భారత్ స్పందన

మరోవైపు అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాలపై భారత విదేశాంగశాఖ తొలిసారిగా స్పందించింది. ఈ ఎన్నికల ఫలితాలు భారత్- అమెరికా మధ్య ఉన్న ద్వైపాక్షిక సంబంధాలపై ఎలాంటి ప్రభావం చూపబోవని స్పష్టం చేసింది. భారత్- అమెరికా భాగస్వామ్యానికి రిపబ్లికన్ పార్టీ, డెమోక్రాట్ల నుంచి బలమైన మద్దతు ఉందని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. ఎన్నికల ఫలితాలపై తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయబోమన్న ఆయన, ఇరు దేశాల మధ్య ఉన్న సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లడానికి తాము కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించారు. ఇటీవలే జరిగిన అమెరికా మధ్యంతర ఎన్నికల్లో ట్రంప్ నేతృత్వంలోని రిపబ్లికన్ పార్టీ ఓటమిని చవిచూసింది. ఈ ఎన్నికల్లో డెమోక్రాట్లు అసాధారణంగా గెలిచి అమెరికా చట్టసభలపై పూర్తి పట్టు సాధించారు. ఈ నేపథ్యంలో మధ్యంతర ఎన్నికల ఫలితాలు భారత్-అమెరికా ద్వైపాక్షిక సంబంధాలు ఏ మేరకు ప్రభావితం చేస్తాయన్న ప్రశ్నకు విదేశాంగశాఖ స్పష్టతనిచ్చింది. భారత్‌లో గురుద్వారాలు, చర్చిలు, మసీదులతో సహా మతపరమైన ప్రదేశాలను లక్ష్యంగా చేసుకునే ఘటనలు పెరుగుతున్నాయని 'యునైటెడ్ స్టేట్స్ కమిషన్ ఆన్ ఇంటర్నేషనల్ రిలీజియస్ ఫ్రీడమ్') కమిషనర్ చేసిన వ్యాఖ్యలపైనా రణధీర్ జైస్వాల్ స్పందించారు. 'అనేది పక్షపాతంతో కూడిన, సరైన అవగాహన లేని సంస్థ. దీనికి స్పష్టమైన రాజకీయ ఎజెండా ఉంది. అమెరికాలో మతపరమైన ప్రదేశాలపై జరుగుతున్న దాడుల గురించి, అలాగే అక్కడ భారతీయ సమాజాన్ని లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న ద్వేషపూరిత నేరాలు, జాతి వివక్ష ఘటనలపై దాని కమిషనర్లు ఎప్పుడూ మౌనంగానే ఉంటున్నారు.

వాయు కాలుష్యంలో ఎందుకు 'విశ్వగురువులం' అవుతున్నాం

మొదటి పేజి తరువాయి



దెబ్బతినడం, శిశు మరణాల ప్రమాదం పెరగడం వంటివి జరుగుతున్నాయని పరిశోధనలు వెల్లడించాయి."

'నిబంధనలను కఠినంగా అమలు చేయాలి'

2026 నాటి ఆర్‌టీఐ వివరాల ప్రకారం, దిల్లీ పర్యావరణ నష్టపరిహార వసూళ్లలో దాదాపు 60 శాతం, అంటే సుమారు రూ. 1,154 కోట్లు ఖర్చు చేయకుండా మిగిలిపోయాయని అన్నారు. 2025 డిసెంబర్ వరకు విడుదల చేసిన జాతీయ స్వచ్ఛమైన గాలి కార్యక్రమ నిధుల్లో దిల్లీ కేవలం 17 శాతాన్ని మాత్రమే వినియోగించుకుందని ఆరోపించారు. మరోవైపు, కాలుష్య సంక్షోభాన్ని దీటుగా ఎ

ప్రజాతీర్పును పాతరేసి..

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు!



పజా మద్దతు మాకే.. అధికార బలంతో ఫలితాలను తారుమారు చేశారు

ఓటమి భయంతోనే అక్రమాలకు తెగబడ్డారు.. అధికార యంత్రాంగాన్ని అడ్డుపెట్టుకున్నారు

10 ఎంపీటీసీ స్థానాల్లో నామినేషన్ల తిరస్కరణ ▸▸ గెలిచిన అభ్యర్థులనే ఓడినట్లు ప్రకటించిన అధికారులు ▸▸ ఏజెంట్లపై దాడులు.. కౌంటింగ్ కేంద్రాల్లో బెదిరింపులు

కౌంటింగ్ కేంద్రాల్లో టీడీపీ నేతల పెత్తనం.. ప్రేక్షకపాత్రలో అధికారులు, పోలీసులు

సీసీ కెమెరాల దృశ్యాలు బయటపెట్టాలి.. న్యాయపోరాటం చేస్తాం : మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి

అనంతపురం, నవంబర్ 10, దరువు న్యూస్ :

జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో రాప్తాడు నియోజకవర్గంలో ప్రజాతీర్పును అధికార బలంతో తారుమారు చేశారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆరోపించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఆత్మకూరు, అనంతపురం రూరల్, రాప్తాడు మండలాల్లో పరిటాల సునీతకు 12వేల ఓట్ల మెజార్టీ వస్తే.. తాజా ఎన్నికల్లో ఆ మెజార్టీ ఇంచుమించు 2 వేలకే పరిమితమైందని తెలిపారు. అంటే టీడీపీకి 10 వేలకుపైగా ఓట్ల మెజార్టీ తగ్గిందన్నారు. ఎన్నికలు సజావుగా, నిష్పక్షపాతంగా జరగలేదని, ఓటమి భయంతోనే అధికారులను అడ్డుపెట్టుకుని అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఓడిపోతామనే భయంతో 10 ఎంపీటీసీ స్థానాల్లో నామినేషన్ల తిరస్కరణ

పక్కాగా ఓడిపోతామనే భయం ఉన్న 10 ఎంపీటీసీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల నామినేషన్లను తిరస్కరించి ఏకగ్రీవం చేసుకున్నారని ఆరోపించారు. ఈ పది స్థానాల్లోనూ తమ అభ్యర్థులకు గణనీయమైన మెజార్టీ వచ్చేదన్నారు. తాటిచెర్లలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కేవలం 5ఓట్ల తేడాతో ఓడిపోయినట్లు ప్రకటించారని, ఎన్నిసార్లు రీకౌంటింగ్ కోరినా అధికారులు పట్టించుకోలేదన్నారు. రాప్తాడు మండలం ఎం.చెర్లోపల్లిలో తమ అభ్యర్థి 110 ఓట్లతో గెలిస్తే.. టీడీపీ అభ్యర్థి 24 ఓట్లతో గెలిచినట్లు ధ్రువీకరించారని ఆరోపించారు.

గెలిచిన స్థానాల్లోనూ ఓటమిగా ప్రకటించారు

ఆత్మకూరు, చెన్నేకొత్తపల్లి, రాప్తాడు, అనంతపురం రూరల్ మండలాల్లో ఆర్ఓలు దుర్మార్గంగా వ్యవహరించారని విమర్శించారు. అనంతపురం రూరల్ మండలంలో తాము గెలిచిన ఎంపీటీసీ స్థానాలను పరిశీలిస్తే టీడీపీ కంటే వైఎస్సార్‌సీపీకే ఎక్కువ మెజార్టీ వచ్చింది న్నారు. ఆర్ఓ నారాయణస్వామి రౌడీషీటర్లు, టీడీపీ నాయకులతో కలిసి చర్చించిన తర్వాత నిర్ణయాలు ప్రకటించారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ గెలిచిన చోట్ల కూడా డిక్లరేషన్లు ఇవ్వకుండా టీడీపీ అభ్యర్థులకు ఇచ్చారని మండిపడ్డారు. ప్రసన్నాయపల్లి-2లో పూర్తిస్థాయిలో ఓట్ల సైక్లింగ్ జరిగిందని ఆరోపించారు.

కౌంటింగ్ కేంద్రాల్లో టీడీపీ నేతల పెత్తనం

కౌంటింగ్ ఏజెంట్లను టీడీపీ గూండాలు బెదిరించి కేంద్రాల నుంచి బయటకు పంపించారని ఆరోపించారు. టీడీపీ జెడ్పీటీసీ అభ్యర్థి భర్త పామురాయి వెంకటేష్ తమ నాయకులను దూషిస్తూ దాడులకు పాల్పడ్డారని తెలిపారు. ఇంత జరిగినా టీడీపీ నాయకులను కౌంటింగ్ కేంద్రాల నుంచి బయటకు పంపలేదన్నారు. చాలాచోట్ల తమ ఏజెంట్లకు ఫారాలు కూడా ఇవ్వలేదని, దీంతో కౌంటింగ్ బహిష్కరిస్తున్నట్లు ప్రకటించి బయటకు వచ్చినా ప్రభుత్వం స్పందించలేదని విమర్శించారు. శ్రీ సత్యసాయి జిల్లా అధికారులు మాత్రం దున్నపోతు మీద వర్షం కురిసినట్లు వ్యవహరించారని మండిపడ్డారు.

నన్ను హౌస్ అరెస్ట్ చేశారు.. పరిటాల సునీతకు మాత్రం స్వేచ్ఛ

ఎన్నికల ప్రచారానికి తనను తిరగనివ్వలేదని, పోలింగ్ రోజు కూడా హౌస్ అరెస్ట్ చేశారని ప్రకాష్‌రెడ్డి ఆరోపించారు. కౌంటింగ్ రోజు కూడా తనను హౌస్ అరెస్ట్ చేశారని తెలిపారు. మరోవైపు పరిటాల సునీత మాత్రం ప్రచారాల్లో పాల్గొన్నారని, కౌంటింగ్ రోజు ఆమెతోపాటు ఆమె తమ్ముళ్లు, టీడీపీ నాయకులు కౌంటింగ్ కేంద్రాల్లోకి వెళ్లారని విమర్శించారు. తమకు అనుకూలంగా వ్యవహరించే అధికారులను ఆర్ఓలుగా నియమించుకుని యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు.

సీసీ కెమెరాల దృశ్యాలు ఇవ్వాలి

రాప్తాడు, అనంతపురం రూరల్, ఆత్మకూరు, చెన్నేకొత్తపల్లి మండలాల కౌంటింగ్ కేంద్రాల సీసీ కెమెరాల దశ్యాలు ఇవ్వాలని ఎన్నికల కమిషన్‌ను కోరినట్లు తెలిపారు. రామగిరి, కనగానపల్లి మండలాల్లోని పోలింగ్ కేంద్రాల సీసీ కెమెరాల దృశ్యాలను కూడా అందించాలని డిమాండ్ చేశారు. రామగిరి, కనగానపల్లి మండలాల్లో పూర్తిస్థాయిలో రిగ్గింగ్ జరిగిందని ఆరోపించారు. పేరూరు డ్యాంను ఎండబెట్టిన పరిటాల సునీతకు తగిన గుణపాఠం చెప్పాలని ఆయా మండలాల ప్రజలు నిర్ణయించుకున్నారని పేర్కొన్నారు. ఓటమి భయంతోనే రిగ్గింగ్‌కు పాల్పడ్డారని విమర్శించారు.

పోలీసుల తీరుపై తీవ్ర అభ్యంతరం

దొంగలు, దౌర్జన్యపరులు, రౌడీషీటర్లు తమ పార్టీ నాయకులు, ఏజెంట్లపై దాడులకు పాల్పడుతుంటే పోలీసులు నిందితులకు కాపలా కాశారని ఆరోపించారు. తమ అభ్యర్థులు, ఏజెంట్లను తీవ్రస్థాయిలో బెదిరించారని తెలిపారు. కార్యకర్తలు రక్తగాయాలైనా ఓర్చుకుని ఎదురొడ్డి నిలబడ్డారని చెప్పారు. రెండు జిల్లాల ఎస్పీలు ఇప్పటికైనా పరిస్థితిని చక్కదిద్దకపోతే ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు.

సీఐలు, ఆర్ఓలను విధుల నుంచి తప్పించాలి

ఇటుకలపల్లి, అనంతపురం రూరల్ సీఐలు హేమంత్‌కుమార్, శ్రీకాంత్‌యాదవ్‌ల వ్యవహారశైలిపై ఎస్పీ దృష్టి సారించాలని కోరారు. పంచాయతీ ఎన్నికలు పూర్తయ్యే వరకైనా ఈ ఇద్దరు అధికారులను ఈ ప్రాంతంలో లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఆర్ఓలు నారాయణస్వామి, రవి, కిరణ్‌కుమార్‌రెడ్డిని ఆర్ఓ విధుల నుంచి తప్పించాలని కలెక్టర్‌ను కోరారు. కనగానపల్లి ఎన్నికల అధికారి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, ధర్మవరం డీఎస్పీ కూడా పక్షపాత వైఖరి ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు.

పంచాయతీ ఎన్నికల్లోనైనా దౌర్జన్యాలు జరగకుండా చూడాలి

రాప్తాడు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పంచాయతీ ఎన్నికలను మొదటి విడతలోనే నిర్వహిస్తున్నారని ప్రకాష్‌రెడ్డి తెలిపారు. బందోబస్తు కల్పించలేమనే కారణంతో టీడీపీ నాయకులు మళ్లీ దౌర్జన్యాలకు పాల్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసు వ్యవస్థ దౌర్జన్యాలను అడ్డుకునేందుకు సిద్ధంగా లేకపోతే మరో వ్యవస్థ పుట్టుకొస్తుందని హెచ్చరించారు. ఇలాంటి పరిస్థితులకు అధికారులు ఊతం ఇవ్వొద్దని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్, ఎస్పీని కోరారు.

2029లో రాప్తాడులో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురుతుంది

ఇన్ని దౌర్జన్యాలు జరిగినా ప్రజలు తమవైపే నిలిచారని ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. 2029 ఎన్నికల్లో తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఎమ్మెల్యే అవుతాడనే నమ్మకాన్ని ప్రజలు కల్పించారని తెలిపారు. ఓట్లు వేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. జరిగిన అక్రమాలపై కోర్టును ఆశ్రయిస్తున్నామని, న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నామని స్పష్టం చేశారు.

పేద విద్యార్థుల పీజీ కలలకు కూటమి సర్కారు గండి!

- ప్రభుత్వ యూనివర్సిటీల్లోనూ+ స్పాట్ అడ్మిషన్లు నిర్వహించలేని అసమర్థ ప్రభుత్వం!
- శాఖ యూనివర్సిటీ వీసీకి వినతిపత్రం అందజేసిన వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం
- ప్రభుత్వ యూనివర్సిటీల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించాలి!
- విద్యార్థుల ఉన్నత విద్యా భవిష్యత్తుతో కూటమి ప్రభుత్వం చెలగాటం
- విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యార్థులకు సమాధానం చెప్పాలి
- ఖాళీ సీట్లు భర్తీ చేయకపోవడం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమే!

అనంతపురం ఎస్.కే.యు / నవంబర్ 10 దరువు న్యూస్ : ప్రభుత్వ యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న పీజీ సీట్లను భర్తీ చేసేందుకు పీజీ సెట్ స్పాట్ అడ్మిషన్లు నిర్వహించకుండా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అనంతపురం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ యాదవ్ తీవ్రంగా విమర్శించారు. ఈ మేరకు ఎస్ కె యూనివర్సిటీ నాయకులు హేమంత్ కుమార్ మరియు విద్యార్థులతో కలిసి వైస్ ఛాన్సలర్‌ను కలిసి



వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ యూనివర్సిటీల్లో మిగిలిపోయిన పీజీ సీట్లకు వెంటనే స్పాట్ అడ్మిషన్లు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనంతపురం లాంటి కరువు ప్రభావిత జిల్లాలో పేద, మధ్యతరగతి విద్యార్థులు ప్రైవేట్ కళాశాలల్లో అధిక ఫీజులు చెల్లించి పీజీ చదివే పరిస్థితి లేదని ప్రభుత్వ యూనివర్సిటీల్లో చదువుకోవాలనే ఆశతో ఎదురుచూస్తున్న విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించకపోవడం తీవ్ర అన్యాయమని వారు మాట్లాడారు. ఒకవైపు ప్రభుత్వ యూనివర్సిటీల్లో సీట్లు ఖాళీగా ఉంటే.. మరోవైపు పీజీ చదవాలనే ఆసక్తి ఉన్న విద్యార్థులు అడ్మిషన్లు లేక చదువులకు దూరవుతున్నారని ఇది ప్రభుత్వ విద్యారంగంపై కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యార్థుల సమస్యలపై దృష్టి పెట్టకుండా ప్రచారానికే పరిమితమవుతున్నారా అంటూ ప్రశ్నించారు విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అంటూ ప్రభుత్వ యూనివర్సిటీల్లో అడ్మిషన్ల సంఖ్య తగ్గితే దానికి బాధ్యత ఎవరు వహిస్తారని మంత్రిని ప్రశ్నించారు. ఎస్ కె యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న పీజీ సీట్ల వివరాలను ప్రకటించాలని, అర్హులైన విద్యార్థులకు పారదర్శకంగా స్పాట్ అడ్మిషన్లు కల్పించాలని,విద్యార్థులకు దరఖాస్తు చేసుకునేందుకు తగిన గడువు ఇవ్వాలని,విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే విధానాలను కూటమి ప్రభుత్వం వెంటనే విడనాడాలని,పేద విద్యార్థుల ఉన్నత విద్యా ఆశయాలకు అడ్డంకులు సృష్టించకుండా తక్షణమే స్పాట్ అడ్మిషన్లు నిర్వహించి న్యాయం చేయాలని ప్రభుత్వంని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో వైస్సార్సీపీ విద్యార్థి నాయకులు శివ, తెజేశ్వర్ రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్,నాయకులు బబ్లు, సాయిచరణ్, శివ, పులి కార్తికేయ, రాహుల్ రెడ్డి, చంద్ర, ఇమ్రాన్, ఫయాజ్, జుబేర్ తదితరులు పాల్గొన్నారు

అనంతపురం కేఎస్ఎన్ కళాశాలలో కలకలం.. రెండో అంతస్తు నుంచి కిందపడ్డ విద్యార్థిని!



అనంతపురం నవంబర్ 10 దరువు న్యూస్ : అనంతపురం నగరంలోని కేఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో బుధవారం ఉదయం విద్యార్థిని రెండో అంతస్తు నుంచి కిందపడిన ఘటన కలకలం రేపింది. ఈ ఘటనలో బీఏ హిస్టరీ సెకండ్ ఇయర్ చదువుతున్న వసంత అనే విద్యార్థినికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన కళాశాల యాజమాన్యం ఆమెను చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించింది. అయితే విద్యార్థిని రెండో అంతస్తు నుంచి కిందపడటానికి గల కారణాలపై పలు అనుమానాలు వ్యక్తవ-ఎవుతున్నాయి. కళ్లు తిరిగి పడిందా? కాలు జారి ప్రమాదవశాత్తు కిందపడిందా? లేక మరేదైనా కారణం ఉందా? అనే విషయాలు తెలియాల్సి ఉంది. ఘటన జరిగిన వెంటనే విద్యార్థినిని ఆసుపత్రికి తరలించామని కళాశాల ప్రిన్సిపల్ తెలిపారు. విద్యార్థిని స్వగ్రామం నార్పల మండలం బి.పప్పూరు గ్రామం. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఎమ్మెల్యే సునీతా ఆశీర్వాదముతో గెలుపొందిన పాలచర్ల ఎంపీటీసీ ముత్యాలు లక్ష్మీదేవి

దరువు న్యూస్ న్యూస్ 10: రాప్తాడు నియోజకవర్గ కేంద్రం మండలంలోని పాలచర్ల భోగినేపల్లి ఎంపీటీసీగా టీడీపీ తరపున గెలుపొందిన పాలచర్ల ముత్యాలు సతీమణి ఆర్ లక్ష్మీ దేవి 150 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ప్రజాసేవ చేసేందుకు తనకు ఈ అవకాశం కల్పించిన ఎమ్మెల్యే పరిటాల సునీతకు, ధర్మవరం టిడిపి ఇన్‌ఛార్జ్ పరిటాల శ్రీరాంకు, మండల ఇన్‌ఛార్జ్ ధర్మవరం మురళికి ఆమె రుణపడి ఉంటానని తెలిపారు. రాప్తాడు మండలంలోని పాలచర్ల బోగినేపల్లి గ్రామాలను అన్ని విధాలా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. తన విజయానికి తోడ్పాటు అందించిన మండల ముఖ్య నాయకులకు, కార్యకర్తలకు మరియు తనను ఆశీర్వదించిన ఓటర్లకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



హత్య కేసులో నలుగురి అరెస్ట్

మరో నిందితుడి కోసం గాలింపు

కార్వేటినగరం, నవంబర్ 10 (దరువు న్యూస్): కార్వేటినగరం మండలంలో యుగంధర్ హత్య కేసులో నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. మరో నిందితుడు పరారీలో ఉండటంతో అతడి కోసం ప్రత్యేక పోలీసు బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. కారు వివాదంలో మధ్యవర్తిత్వం చేసినందుకు యుగంధర్‌పై కక్ష పెంచుకున్న నిందితులు, పోలీసులకు ఫిర్యాదు చేశాడనే కారణంతో హత్యకు కుట్ర పన్నినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.పోలీసుల వివరాల ప్రకారం.. కార్వేటినగరం మండలం తురకమిట్ట గ్రామానికి చెందిన పి. యుగంధర్‌కు కారు విషయంలో మధ్యవర్తిత్వం చేసిన నేపథ్యంలో కె.ఎం.పురం గ్రామానికి చెందిన కొందరితో వివాదం ఏర్పడింది. ఈ క్రమంలో నవంబర్ 7న నిందితులు యుగంధర్‌ను దుర్భాషలాడి, దాడి చేసి చంపుతామని బెదిరించారు.నవంబర్ 9న యుగంధర్ తన స్నేహితులు ప్రభుదాస్, అశోక్ కుమార్‌లతో కలిసి కె.ఎం.పురం గ్రామానికి వెళ్లి లీలా



కుమార్, గిరితో మాట్లాడుతున్న సమయంలో మరోసారి గొడవ జరిగి బెదిరింపులు ఎదురయ్యాయి.దీంతో యుగంధర్ తన స్నేహితులతో కలిసి కార్వేటినగరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమపై ఫిర్యాదు చేశాడనే కక్షతో యుగంధర్‌ను హత్య చేయాలని నిందితులు పథకం రచించినట్లు పోలీసులు తెలిపారు.ఈ క్రమంలో మారుతి సుజుకి బాలెనో కారులో కె.ఎం.పురం నుంచి కార్వేటినగరం వైపు వస్తున్న నిందితులు, ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ సమీపంలో ద్విచక్ర వాహనంపై ఎదురుగా వస్తున్న యుగంధర్, ప్రభుదాస్‌లను గుర్తించారు. కారును వెనక్కి తిప్పి వేగంగా నడుపుతూ వారి ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొట్టినట్లు పోలీసుల ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఘటనలో యుగంధర్ అక్కడికక్కడే మృతి చెందగా, ప్రభుదాస్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.ఈ కేసులో ప్రధాన నిందితుడు బి. ప్రదీప్ రాజు (29), బి. దిలీప్ రాజు (32), బి. లీలా కుమార్ అలియాస్ లీలా కృష్ణ (25), బి. విజయ అలియాస్ విజయలక్ష్మి (55)లను నవంబర్ 10న మధ్యాహ్నం 1.30 గంటలకు అమ్మాపల్లి క్రాస్ వద్ద అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. మరో నిందితుడు రవి కుమార్ రాజు పరారీలో ఉన్నాడని, అతడి కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నట్లు వెల్లడించారు.చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని హత్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, నేరాలకు పాల్పడిన వారు ఎంతటివారైనా చట్టం ముందు నిలబడాల్సిందేనని చిత్తూరు జిల్లా పోలీసు శాఖ స్పష్టం చేసింది.

వైభవంగా షాహిద్ జన్మదిన వేడుకలు..

దరువు న్యూస్:10: షా ఫర్నిచర్ అధినేత షేక్ షాహిద్ జన్మదిన వేడుకలు సోమవారం రాత్రి పోరుమా మిళ్లలో ఘనంగా జరిగాయి. కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు, షా ఫర్నిచర్ షాప్ కస్టమర్స్ షాహిద్ జన్మదిన వేడుకలకు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. షా ఫర్నిచర్ షాపులో కేక్ కట్ చేసి షాహిద్ జన్మదిన వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా షాహిద్ మాట్లాడుతూ... తన జన్మదిన వేడుకలకు హాజరై శుభాకాంక్షలు తెలిపిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఇటీవల షా ఫర్నిచర్ షాప్ ను ప్రారంభించా మని, తమ వ్యాపారాభివృద్ధికి సహక రిస్తున్నప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదా పీర్ షాహిద్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి వ్యాపార రంగంలో రాణించాలని అభిలషించారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ గౌస్ (మున్నా), డాక్టర్ బాషా, షర్మిల, డాక్టర్ షేక్ సోని, నూర్జహాన్, కరిమూన్ తదితరులు హాజరై షాహిద్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.



ధైర్యంగా ఉండండి.. పాప త్వరగా కోలుకుంటాది

కేఎస్ఎన్ డిగ్రీ విద్యార్థిని తల్లిదండ్రులను ఫోన్‌లో పరామర్శించిన మేయర్ రమేష్ గౌడ్



అనంతపురం, నవంబర్ 10, దరువు న్యూస్ :

కేఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థిని రెండవ అంతస్తు నుండి అనుమానాస్పద స్థితిలో కిందపడి తీవ్ర గాయాలపాలైన విద్యార్థిని తల్లిదండ్రులకు అనంతపురం నగర మేయర్ చిట్టూరి రమేష్ గౌడ్ ఫోన్ ద్వారా పరామర్శ చేశారు. ధైర్యంగా ఉండాలని, పాప త్వరగా కోలుకుని మీ ముందు తిరిగి తేరుకుంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మేయర్ రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థిని ఆరోగ్యం కోసం అవసరమైన వైద్యసహాయం అందించేలా అధికారులకు సూచనలు ఇస్తానని తెలిపారు. ప్రభుత్వం, స్థానిక సంస్థ తరపున ఎలాంటి సహాయం అవసరమైనా అందిస్తామని విద్యార్థిని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. విద్యార్థిని ఆరోగ్య స్థితిపై ప్రతిష్టాత్మకంగా పర్యవేక్షణ జరుగుతుందని, ఆమె వీలునాడికి అందుబాటులో ఉండటానికి కుటుంబ సభ్యులు ఎప్పుడైనా సంప్రదించవచ్చని మేయర్ తెలిపారు. ప్రజల సమస్యలపై స్పందించడమే తన బాధ్యత అని, విద్యార్థిని త్వరగా కోలుకోవడం కోసం తాను వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తానని రమేష్ గౌడ్ పేర్కొన్నారు. ఈ సంఘటనపై విద్యార్థిని తల్లిదండ్రులు, స్థానికులు మేయర్ ప్రతిపత్తిని ప్రశంసించారు.

పార్థివ దేహానికి నివాళులర్పించిన పామిడి వీరా



పామిడి, నవంబర్ 10, దరువు న్యూస్ :

పామిడి పట్టణ సమీపంలో ఎంహెచ్ లక్ష్మీనారాయణరెడ్డి తల్లి వెంకటమ్మ మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ పామిడి వీరా వారి నివాసానికి వెళ్లి వెంకటమ్మ భౌతికకాయంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వెంకటమ్మ మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.

టీడీపీ సీనియర్ నేతకి మాతృవియోగం

ఆమె భౌతికకాయానికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే

పామిడి, నవంబర్ 10, దరువు న్యూస్ :



తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు ఎంహెచ్ లక్ష్మీనారాయణ రెడ్డి మాతృమూర్తి వెంకటమ్మ మంగళవారం రోజున మృతి చెందారు. ఈ సమాచారం తెలుసుకొన్న గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే జితేంద్ర గౌడ్ పామిడి మండల కేంద్రంలోని ఎంహెచ్ లక్ష్మీనారాయణ రెడ్డి స్వగృహానికి వెళ్లి ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ యాదవ్, జిలాన్, కేశప్ప, బండి లక్ష్మిదేవి, రంగా, పామిడి, గుంతకల్లు, గుత్తి మండలం పట్టణం టీడీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పామిడిలో కత్తితో దాడి.. నిందితుడి అరెస్ట్

పామిడి, నవంబర్ 10, దరువు న్యూస్ :



పామిడి పట్టణంలోని మెయిన్ బజార్‌లో ఈనెల 8వ తేదీ రాత్రి డబ్బుల వ్యవహారంలో తలెత్తిన వివాదం కత్తితో దాడికి దారితీసింది. ఈ ఘటనలో మురళీ ధర్ గుప్తా అనే వ్యక్తిపై జిట్టా మంగల ఎర్రి స్వామి కత్తితో దాడి చేయడంతో ఆయన గాయపడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో నిందితుడైన జిట్టా మంగల ఎర్రిస్వామిని మంగళవారం ఉదయం అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరిచారు. అనంతరం న్యాయస్థానం ఆదేశాల మేరకు అతడిని జైలుకు తరలించారు. ఈ సందర్భంగా సీఐ మనోహర్ మాట్లాడుతూ.. ఎవరైనా వ్యక్తిగత వివాదాలు, డబ్బుల వ్యవహారాల పేరుతో దాడులకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి తీవ్రమైన దాడి కేసుల్లో నేరం రుజువైతే పదేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

గడపగడపకూ ఆత్మీయ పలకరింపు..

ప్రజలకు కృతజ్ఞతలు తెలిపిన కాబోయే ఎంపీపీ స్వాతిలతా రెడ్డి



నార్పల, నవంబర్ 10, దరువు న్యూస్ :

నార్పల 3వ ఎంపీటీసీ స్వాతిలతారెడ్డి (కాబోయే ఎంపీపీ), నాకు ఓట్లు వేసి గెలిపించిన గడపగడపకూ వెళ్లి ఆత్మీయంగా కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు చూపించిన ఆధారణ, ప్రేమాభిమానాలను ఎప్పటికీ మరిచిపోనని, కష్టసుఖాల్లో తోడుగా ఉంటూ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.



విద్యార్థి నేతల మౌనం.. దేనికి సంకేతం..!?

- ప్రైవేట్ కాలేజీ ఉదంతాలపై గర్జించే నేతలు...
- అల్లరి చేసి ఆస్తుల విధ్వంశాలకు పాల్పడే నాయకులు...
- కేఎస్ఎన్ బాలిక ఉదంతంపై నేతల మౌనవ్రతాలా..!?

అనంతపురం, నవంబర్ 10, దరువు న్యూస్ :

అనంతపురం నగరంలో ప్రభుత్వ కేఎస్ఎన్ అండ్ డిగ్రీ కళాశాలలో మహిళా విద్యార్థి కళాశాల భవనం పైకి నుంచి దూకి ఆత్మహత్య ప్రయత్నం చేస్తే కనీసం జిల్లాలో ఉన్నటువంటి విద్యార్థి సంఘాలు ఎవరు కూడా స్పందించినటువంటి పరిస్థితి. అదే ఒక కార్పొరేట్ కళాశాలలో జరిగితే నిమిషాల వ్యవధిలో విద్యార్థి సంఘాలు అక్కడికి వాలిపోయి.. ధర్నాలు చేయడం.. ఫర్నిచర్ ధ్వంసం చేయడం బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తారు. వాటితోపాటు వీళ్ళు కూడా విద్యాసంస్థల యాజమాన్లతో డబ్బులు దండుకుంటారు.

- గతంలో అనంతపురం నగరంలో బస్టాండ్ సమీపంలో ఒక కార్పొరేట్ కళాశాలలో కళాశాల విద్యార్థి భవనం పైకి ఎక్కి దూకి ఆత్మహత్య ప్రయత్నం చేస్తే విద్యార్థి సంఘం నాయకులు చివరి వరకు పోరాడి బాధిత కుటుంబానికి న్యాయం చేసి అమ్మాయిని రికవరీ చేసేంతవరకు పోరాటం చేశారు. ఇప్పుడు ఎక్కడికి పోయినాయి అలాంటి విద్యార్థి విద్యార్థి సంఘాల నేతలు..
- జిల్లాలో విద్యార్థులకు సమస్యలు వస్తే వాటిని పరిష్కరించడానికి విద్యార్థి సంఘాల నేతలు ఉన్నారని భరోసా ఉండేది ఒకప్పుడు. కానీ నేడు విద్యార్థులకు సమస్యలు వస్తే అనంతపురం జిల్లాలో విద్యార్థి సంఘాలు ఉన్నాయా లేవా అన్న కోణంలో ఆలోచించాల్సిన దౌర్భాగ్యమైనటువంటి పరిస్థితి అనంతపురం నగరంలో ఏర్పడింది.
- ఒక విద్యార్థి ప్రభుత్వ విద్యాసంస్థలలో చదువుతూ పూర్తిచేసుకుని ఉన్నత స్థానంలో ఉండాలి. మంచి ఉద్యోగం సంపాదించాలన్న ఆశతో విద్యాసంస్థలో చేరితే ప్రభుత్వ విద్యాసంస్థల భవనంపై నుండి ఎక్కి దూకితే ఆత్మహత్య ప్రయత్నం చేస్తే కనీసం జిల్లాలో ఉన్నటువంటి విద్యార్థి సంఘాలు నోరు మెదపకపోవడం కొసమెరుపు. దీని వెనుక ఏమైనా కారణాలు ఉన్నాయా..
- విద్యార్థి ఏ సమస్యతో అయినా ఆత్మహత్య ప్రయత్నం చేసి ఉండవచ్చు కానీ విద్యార్థి సంఘాల నాయకులుగా బాధ్యతయుతంగా ఆ సమస్యను పరిష్కరించి విద్యార్థుల తల్లిదండ్రులకు విద్యార్థినికి న్యాయం చేయాల్సింది పోయి మౌనం పాటించడం ఎంతవరకు సమంజసం.
- ఈ రాష్ట్రంలో ఉద్యమాలకు పురిటి గడ్డగా చెప్పుకునే అనంతపురం నగరంలో ఏదైనా ఒక సమస్య వచ్చినా ఏ ఉద్యమం ప్రారంభించాలన్న అది అనంతపురం నగరం నుండే ప్రారంభమవుతుంది. గత కొన్ని నెలల నుంచి అనంతపురం నగరంలో విద్యార్థుల సమస్యల పైన పోరాటం చేసే నాయకులే లేనట్టు కనపడతా ఉంది.

జిల్లాలో ఎక్కడ విద్యార్థులకు అన్యాయం జరిగినా అరచి నానాయాగి చేసే విద్యార్థి సంఘం నేతలు.. ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలపై దండెత్తి ఆస్తిపాస్తుల విధ్వంశానికి సైతం వెనుకాడని విద్యార్థి సంఘం నాయకులు.. మంగళ వారం కేఎస్ఎన్ కళాశాల విద్యార్థిని ఉదంతం పట్ల విద్యార్థి సంఘాల నేతల మౌనంపై పలు అనుమానాలు రేకెత్తిస్తున్నా యి. ప్రభుత్వ కాలేజీ అయినా.. ప్రైవేటు కళాశాలలో అయి నా.. చదివే విద్యార్థులంతా ఒక్కటే. ఆ విషయం మనకన్నా అనునిత్యం విద్యార్థి సమస్యలపై పోరాటం చేసే నాయకులకు మరింత లోతుగా తెలుసు.. అలాంటి నేతలు కేసులను దంత ముపై ఎవరిని నిలదీయకపోవడం ఏమైందని ప్రశ్నించకపో వడం కేవలం పరామర్శలతో ఫోటోలకు ఫోజులిచ్చే పనిలో మునిగి వెనుతిరిగి రావడం తదితర అంశాలు విద్యార్థి సంఘా ల నేతల మూగనోముపై పలువురు పలు రకాల అనుమానా లను వ్యక్తం చేస్తున్నారు. ఇందులో ప్రధానంగా ప్రైవేటు కాలేజీ యాజమాన్యాల విషయంలో ధర్నాలు, నిలతీతలు వెనుక అర్థిక పరమైన అంశాలు అత్యంత ప్రాధాన్యతను కలిగి ఉంటాయన్న సంగతి బహిరంగ రహస్యమే. అదే సమయంలో ప్రైవేట్ కాలేజీ యాజమాన్యాలు అనుసరిస్తున్న విధానాలను కూడా ఒక విధంగా విద్యార్థి సంఘం నేతలు తమకు అనుకూలంగా అంది 'పుచ్చు' కోవడం పరిపాటిగా మారిపోయింది. అదే ప్రభు త్వ కాలేజీల్లో విద్యార్థులకు నిజంగా అన్యాయం జరిగినా.. వారి వైపు నిలబడేందుకు విద్యార్థి సంఘాలు అంతగా ఆసక్తి చూపవనే మంగళవారం నాటి కేఎస్ఎన్ బాలిక ఉదంతమే ఒక తార్కానంగా నిలుస్తుంది.

అనంతపురంలో విద్యార్థి సంఘాల వినూత్న నిరసన

- విద్యార్థులకు భద్రత కల్పించాలని డిమాండ్
- కేఎస్ఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి
- ఏఐఎస్బి, బీసీవై విద్యార్థి విభాగం నాయకులు డిమాండ్

అనంతపురం, నవంబర్ 10, దరువు న్యూస్ :



రాష్ట్రంలో విద్యార్థులకు రక్షణ, భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ అనంతపురం నగరంలో ఏఐఎస్బి, బీసీవై విద్యార్థి విభాగం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట విద్యార్థి సంఘాల నాయకులు కళ్లకు గంతలు కట్టుకుని వినూత్నంగా ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐఎస్బి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాపిరెడ్డిపల్లి పృథ్వీ, బీసీవై విద్యార్థి విభాగం రాష్ట్ర కన్వీనర్ సురేష్ యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యార్థులపై దాడులు జరుగుతున్నాయని, ముఖ్యంగా మహిళా విద్యార్థులకు భద్రత కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతపురం జిల్లాలోని కేజీబీవీ పాఠశాలల్లో ఫుడ్ పాయిజనింగ్ ఘటనలు, రాప్తాడులో చోటుచేసుకున్న సంఘటనతో పాటు, తాజాగా అనంతపురంలోని ఖాచీ డిగ్రీ కళాశాలలో సెకండ్ ఇయర్ విద్యార్థి కళాశాల భవనం నుంచి కిందకి పడడం వంటి ఘటనలు విద్యార్థుల భద్రతపై అనేక ప్రశ్నలు లేవనెత్తుతున్నా యని అన్నారు. కేఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో జరిగిన విద్యార్థి ఘటనపై కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపల్ బాధ్యతలను ఆయన ప్రశ్నించారు. కళాశాల ప్రారంభమయ్యే సమయానికి బాధ్యతాయు తమైన అధికారులు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల సమస్యలపై విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వెంటనే స్పందించాలని, రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల్లో భద్రతా పరిస్థితులపై ప్రత్యేక సమీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా మహిళా విద్యార్థులకు రక్షణ కల్పించాలని, విద్యాసంస్థల్లో అధికారుల పర్యవేక్షణ పెంచాలని కోరారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం కొనసాగిస్తే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్బి నగర అధ్యక్ష కార్యదర్శులు గౌతమ్ సాయి, ఇంతియాజ్, నగర ఉపాధ్యక్షులు మనోజ్, కిరణ్ బీసీవై విద్యార్థి విభాగం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని ప్రాణాలకు భరోసా కల్పించాలి..

- మెరుగైన వైద్యం అందించాలి!
- విద్యార్థుల భద్రత కల్పించలేని యాజమాన్యం సమాధానం చెప్పాలి
- విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడితే సహించేది లేదు
- అంబేద్కర్ విగ్రహం వద్ద ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన



అనంతపురం, నవంబర్ 10, దరువు న్యూస్ :

కేఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థిని రెండవ అంతస్తు నుండి అనుమానాస్పద స్థితిలో కిందపడి తీవ్ర గాయాలపాలైన ఘటన కలకలం రేపింది. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని పరిస్థితి విషమంగా ఉందని, వైద్యులు సైతం నమ్మకం లేదని చెప్పడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సందర్భంగా పీఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ఆలం, దీజ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు కేశవ, యుఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భీమేష్, పీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రతిభ భారతి మాట్లాడుతూ.. ఈ దారుణ ఘటనపై సమాచారం అందుకున్న ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు వెంటనే ఆసుపత్రికి చేరుకుని, విద్యార్థిని తల్లిదండ్రులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. అనంతరం కళాశాల యాజమాన్యం, అధికారుల నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేశారు. కళాశాల భవనాల భద్రతా వైఫల్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఆరోపించారు. ఈ ఘటనపై సమగ్రమైన, నిష్పాక్షపక్షమైన విచారణ జరిపించి, బాధ్యులైన వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించడంతో పాటు, ఆమె కుటుంబానికి తగిన న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పీఎస్ఎఫ్ భోగినేష్, రామ కిషోర్, షాహిద్, త్రిలోక్, భరత్, అభి తదితరులు పాల్గొన్నారు.

కేఎస్ఎన్ కళాశాల ప్రమాద బాధితురాలికి టీడీపీ నేతల పరామర్శ

- ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆదేశాలతో ఆసుపత్రికి వెళ్లిన నాయకులు
- ఫోన్ ద్వారా వివరాలు తెలుసుకున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం, నవంబర్ 10, దరువు న్యూస్ :



అనంతపురం నగరంలోని కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన ప్రమాద బాధితురాలని అనంతపురం టిడిపి నాయకులు పరామర్శించారు. బీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వసంత అనే విద్యార్థిని కళాశాల రెండవ అంతస్తు నుండి ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడింది. కాలేజీ యాజమాన్యం సమాచారం ప్రకారం.. విద్యార్థిని కాలుజారి కిందపడినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థిని పరిస్థితి విషమంగా ఉండటంతో వెంటిలేటర్‌పై అత్యవసర చికిత్స అందిస్తుండగా.. ఈ విషయంపై ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వెంటనే స్పందించారు. ఫోన్ ద్వారా ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు స్థానిక తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షుడు, టిడిపి నాయకులు ఆసుపత్రికి వెళ్లారు. ఐసీయూలో చికిత్స పొందుతున్న వసంత ఆరోగ్య పరిస్థితిని, అందుతున్న వైద్య సేవలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఫోన్ ద్వారా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో పాటు, బాధితురాలికి చికిత్స అందిస్తున్న ప్రత్యేక వైద్య బృందంతో మాట్లాడారు. విద్యార్థిని వసంతకు అవసరమైన అన్ని రకాల అధునాతన వైద్య సేవలను తక్షణమే అందించాలని, చికిత్స విషయంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఆదేశించారు. బాధితురాలి కుటుంబానికి అండగా ఉంటామని, మెరుగైన వైద్యం కోసం అవసరమైతే అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. బాధితురాలిని పరామర్శించిన వారిలో టిడిపి జిల్లా మీడియా కోఆర్డినేటర్ దబ్బర కుమారస్వామి నాయుడు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు ఉన్నారు.

Editor, Prblished and Owned by YENUMULA KULLAYAPPA, Published for D.No. 5-76, Bhanukota, Sri Satya Sai - 515621, Printed from Jai Sriram Publications D.No. 1-3-241, Rangaswamy nagar, Ananthapuramu 515001, EDITOR : YENUMULA KULLAYAPPA Mobile : 94940 39030.